
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల జిల్లా వార్తలు

5★★

మంగళవారం 26 నవంబరు 2024

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

● కలెక్టర్ సత్య ప్రసాద్



దరఖాస్తును స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి సమస్యలను సంబంధిత శాఖ అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్ హాజరై జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 35 దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు ఆన్‌లైన్‌లోని తమ తమ లాగిన్‌లో గల ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించి నివేదిక అందించాలన్నారు. వ్యయ ప్రయాలకు ఓర్చుకొని పలువురు బాధితులు జిల్లాకేంద్రానికి వచ్చి ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పిస్తున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కరించకుంటే నిరుత్సాహానికి గురికావడంతో పాటు పలు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ప్రజలకు ప్రభుత్వంపై భరోసా కల్పించే విధంగా చర్యలు తీసుకొని సమాచారం తెలియజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల ఆర్‌డీఓలు మధుసూదన్, శ్రీనివాస్, జివాకర్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో హన్మంత రావు, డీఆర్‌డీవో రఘువరన్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని బీమారం మండలం కేంద్రం, జగిత్యాల రూరల్ మండలం మోరపెల్లి, సారంగాపూర్ మండలం రంగపేట, మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామాల్లో మీ సేవా కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. ఆసక్తి గలవారు దరఖాస్తు ఫారాలను ఆన్‌లైన్‌లో నుంచి డౌన్‌లోడ్ చేసుకుని విద్యార్హత పత్రాలను జత చేసి తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కొండగట్టులో పీఎఫ్ అడిషనల్ కమిషనర్

మల్యాల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జోనల్ ఈపీఎఫ్‌వో అడిషనల్ కమిషనర్ ఎంఎస్‌కెవీపీ సత్యనారాయణ సోమవారం రాత్రి కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన అడిషనల్ కమిషనర్ దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. పర్యవేక్షకులు సునీల్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌రెడ్డి శాలువతో సత్కరించారు.

న్యూస్ బాక్స్

యాదవ సంఘం అడహక్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా మల్లేష్ యాదవ్



ఎన్నికైన కార్యవర్గం

రాయికల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): యాదవ సంఘం అడ్‌హక్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా గనవేని మల్లేష్ యాదవ్ ఎన్నికయ్యారు. రాయికల్ పట్టణంలోని గుడేటిరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన యాదవ సంఘం అడహక్ కమిటీజిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా సలహాదారులుగా తోట్ల చిన్నయ్య యాదవ్, రెబ్బాసు మల్లయ్య యాదవ్, కొలుముల రమణ యాదవ్, బల్కం మల్లేష్ యాదవ్, దండవేణి మల్లయ్యయాదవ్, ముక్కెర శేఖర్ యాదవ్‌లను ఎన్నుకున్నారు. అలాగే జిల్లాకార్యవర్గ సభ్యులుగా మాదం వినోద్‌యాదవ్, అంకం శంకర్‌యాదవ్, కొక్కెర శంకర్ యాదవ్, చిర్రం ప్రకాష్ యాదవ్‌లు ఎన్నికయ్యారు. అలాగే రాయికల్ మండల అడహక్ కమిటీ ఇన్‌చార్జిలుగా ఆసరి మల్లేష్ యాదవ్, గంగవేణి కొమురయ్య యాదవ్‌లు ఎన్నికయ్యారు.

హాస్టల్స్ మెరుగు పడేనా..?

- వసతి గృహాల నిర్వహణపై సర్కారు ప్రత్యేక ఫోకస్
- మెనూ అమలు, సౌకర్యాలపై దృష్టి
- జిల్లా, మండల స్థాయి కమిటీల ఏర్పాటు
- ఒక్కో హాస్టల్‌కు ఒక్కో ప్రత్యేకాధికారి నియామకం



జగిత్యాల వసతి గృహంలో మధ్యాహ్నం భోజనం చేస్తున్న విద్యార్థులు

జగిత్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, గురుకులాల్లో మెనూ అమలుతీరు, సౌకర్యాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతోనైనా పరిస్థితి మెరుగుపడుతుందా అన్న చర్చ విద్యావర్గాల్లో చోటుచేసుకుంటోంది. జిల్లాలో రెసిడెన్షియల్ స్కూళ్లలో, వసతి గృహాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్య ప్రసాద్ ఇటీవల అధికారులను ఆదేశించారు. ప్రతి రెసిడెన్షియల్ స్కూల్‌లో ఫుడ్ సేఫ్టీ కమిటీ, టెస్ట్ సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాలలో మెనూ ప్రకారం నాణ్యమైన బోజనాన్ని విద్యార్థులకు అందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడంపై అధికారులు దృష్టి సారించారు. పురుగుల పట్టిన బియ్యాన్ని కాకుండా నాణ్యమైన బియ్యాన్ని, ముడి సరుకులు అందిస్తున్నారా..లేదా అన్న విషయంపై కమిటీలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరిపేలా కార్యాచరణ రూపొందించారు. జిల్లాలో ప్రతీ పాఠశాల యందు ఆహారం నాణ్యతగా ఉండేలా చూడాలని, ఎటువంటి పొరపాట్లు చేయకుండా ప్రభుత్వం ద్వారా నిర్దేశించిన పదార్థాలను వడ్డించాలని ప్రభుత్వం ఆదేశించింది.

జిల్లాలో ఏర్పాటు అవుతున్న కమిటీలు...

రాష్ట్ర ప్రభుత్వ ప్రదాన కార్యదర్శి ఆదేశాల మేరకు కలెక్టర్ జిల్లా, మండల స్థాయిలో మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయి కమిటీ ఆయా మండలాల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ హాస్టళ్ల నిర్వహణ మెరుగయ్యేలా చూడాల్సి ఉంటుంది. అలాగే ఒక్కో హస్టల్‌కు జిల్లా, మండల స్థాయిలో అధికారిని ప్రత్యేకాధికారిగా నియమించారు. మండల స్థాయిలో పనిచేసే అధికారులు బృందంగా ఆయా హాస్టళ్లను సందర్శించి ఆయా హస్టళ్ల పరిస్థితిపై రిపోర్టు ఇవ్వాల్సి ఉంటుంది. గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీలలో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతుందో.. లేదో పరిశీలించేందుకు ప్రత్యేక అధికారులు వారానికో సారి ఖచ్చితంగా తమకు కేటాయించిన హస్టళ్లను సందర్శించాల్సి ఉంటుంది.

నాణ్యత మెరుగుపరిచేందుకు...

జిల్లాలో గురుకులాలు, సంక్షేమ వససతి గృహాలు, కేజీబీవీలన్నీ కలిపి 56ఉన్నాయి. ఒక్కోదానికి ఒక్కో అధికారిని ఇన్‌చార్జీగా నియమించారు. ఇన్‌చార్జీలు...

(తరువాయి 8వ పేజీలో)

మహిళా ఉద్యోగినిపై వేధింపులు.. విచారణకు కలెక్టర్ ఆదేశం

జగిత్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల జిల్లాలోని ఓ మహిళా ఉపాధ్యాయురాలిపై తోటి ఉపాధ్యాయుడితో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేధించిన విషయమై కలెక్టర్ విచారణకు ఆదేశించినట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి, జిల్లా లైంగిక వేధింపుల కమిటీ చైర్మన్ సత్తమ్మ తెలిపారు. కోరుట్ల నియోజకవర్గంలోని ఓ మండలానికి చెందిన మహిళా ఉపాధ్యాయురాలు తనను పాఠశాలకు చేదిన ఓ ఉపాధ్యాయుడితో పాటు ప్రధానోపాధ్యాయుడు వేధిస్తున్నారని రెండు రోజుల క్రితం కలెక్టర్‌ను ఆశ్రయించింది. ఈ సంఘటనపై విచారణ జరపాల్సిందిగా జిల్లా లైంగిక వేదింపుల కమిటీ చైర్మన్‌ను కలెక్టర్ ఆదేశించారు. మహిళా ఉపాధ్యాయురాలి ఫిర్యాదుపై వివరణ ఇవాల్సిందిగా సదరు ఉపాధ్యాయుడికి మెమో జారీ చేసినట్టు డీఈవో జగన్మోహన్ రెడ్డి తెలిపారు.

న్యాక్, స్కిల్ యూనివర్సిటీతో యువతకు ఉపాధి

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని న్యాక్ సెంటర్‌తో స్కిల్ యూనివర్సిటీని అనుసంధానం చేయడంతో జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని తారక రామానగర్‌లో రూ.25 లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45ఏళ్ల క్రితం ఏర్పడిన తారకరామానగర్‌కు తాగునీటి సమస్య లేకుండా చేశామని, పట్టణంలో ప్రతి ఇంటికి తాగునీరు సదుపాయం కల్పిస్తామన్నారు. కుల, మత, వర్గ తేడా లేకుండా అభివృద్ధి సంక్షేమం కోసం కృషి చేస్తామని, తనను విమర్శించే నాయకులు వారి నియోజకవర్గాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం ఎందుకు చేపట్టలేదని చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, కమిషనర్ చిరంజీవి, కౌన్సిలర్లు చాంద్ పాషా, దేవేందర్ నాయక్, ఏఈ శరన్ పాల్గొన్నారు.

● జగిత్యాల పట్టణంలోని 43వ వార్డుకు చెందిన కాసం సతీష్ అనారోగ్యంతో బాధ పడుతూ ఉన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సోమవారం ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ శ్రీనివాస్, ఉన్నారు.

ఉచిత వైద్య, విద్యం అందించాలి

ధర్మ సమాజ్ పార్టీ రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

జగిత్యాల అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు ఉచితంగా అందించాలని డిమాండ్ చేస్తూ రాజ్యాధికార సాధన జేఏసీ, ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమీపంలోని జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కన్వీనర్ దువ్వాక శివ మాట్లాడుతూ సమాజంలో 90 శాతం ఉన్న ఎస్సీ, బీసీ, ఎస్టీ ప్రజల కనీస అవసరాలైన ఉచిత విద్య, వైద్యం, ఇల్లు, భూమి ఇవ్వడంతో పాటు ప్రతి ఒక్కరికి అర్హతనుబట్టి ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పై డిమాండ్ల సాధన కోసం ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు విశారదన్ మహారాజ్ వచ్చే జనవరి నుంచి 15 వేల కి.మీ. పాటు పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కో కన్వీనర్ అరుణ్ నేత, తిరుపతి, ఉపేంద్ర, గంగరాజు, కోటేష్, ప్రణీత్, అనుదీప్, ప్రశాంత్, వివిధ మండలాల నుంచి వచ్చిన నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో కార్తీక సందడి

- నదిలో దీపాలు వదిలిన మహిళలు
- భక్తి శ్రద్ధలతో శివుడికి పూజలు



ధర్మపురిలో గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు

7

మధ్యాహ్న భోజనం సరిగ్గా లేదని... విద్యార్థుల ఆందోళన



జగిత్యాలలో ప్రధాన రహదారిపై బైఠాయించిన విద్యార్థులు

8

నిధులు సమకూర్చుకుంటూ సంక్షేమ పథకాల అమలు

- రికార్డు స్థాయిలో ధాన్యం సేకరణ
- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

రాయికల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో కి నెట్టిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి 11 నెలలు గడుస్తుందని, ఇ చ్చిన హామీల అమలుకు నెలనెలా నిధులు సమకూర్చుకుంటూ సంక్షేమ పథకాలు అ మలు చేస్తున్నామని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్ పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ కాళేశ్వరం, మేడిగడ్డ ఎత్తిపోతల అవసరం లేకుండానే వరద కాలువ నీటితో గతంలో కంటే రికార్డు స్థాయి లో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 6 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకాలకు రూ.500 బోనస్ అందిందన్నారు. జిల్లాలో గత సంవత్సరం 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ కాగా, ఈ సీజన్‌లో కోటి 44 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందన్నారు. గతంలో కంటే రెట్టింపు స్థాయిలో ధాన్యం సేకరణ జరుగడం శుభ పరిణామమ న్నారు. సన్న రకాల ధాన్యాన్ని బయట విక్రయిస్తే ప్రభుత్వం అందించే 500 బోనస్ వర్తించదని, కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ లభిస్తుం దన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రూ.18 వేల కోట్లతో రైతు లకు రుణమాఫీ చేపట్టిందని, సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతులు ప్రభు త్వం రుణమాఫీ అమలుకు కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు లను ఆదుకునేందుకు రుణమాఫీతో పాటు సన్న రకాలకు రూ.500 బోనస్ అందిం చిన రాష్ట్ర ఏదైనా ఉందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లో చేపట్టి ప్రజలకు ఉచిత విద్యుత్, రూ.500లకే సబ్సిడీ సిలిండర్, మహిళలకు ఉ చిత బస్సు సౌకర్యం, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి, జిల్లాయూత్ ప్రధాన కార్య దర్శి కొయ్యడి మహిపాల్ రెడ్డి, ఆలయ చైర్మన్‌లు దాసరి గంగాధర్, రాము, నాయ కులు ఎద్దండి భూమారెడ్డి, బత్తిని భూమయ్య, చింతలపల్లి గంగారెడ్డి, తలారి రాజేష్, కొమ్ముల ఆది రెడ్డి, షాకీర్, ఏలేటి జలంధర్, శ్రీకాంత్, నరసింహా రెడ్డి, గుండేటి ఆనందం, అశోక్, రాజశేఖర్, రమేష్ నాయక్, నాగరాజు, శివ, రాజేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు

● ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) :ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు అర్జిదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువ చేసే దిశగా పోలీస్ అధికారులు పనిచేయాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని వివరించారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

మాల మహానాడు డిమాండ్

జగిత్యాల అర్బన్, నవంబర్ (ఆంధ్రజ్యోతి) జగిత్యాల పట్టణంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే శిక్షించాలని మాల మహానాడు జెఏసి చైర్మన్ లక్ష్మీనారాయణ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగిత్యాల తహసీల్ చౌరస్తా వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి సోమవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఇక్కడ అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ప్రజావాణిలో వారు పిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కారంగుల వసంత్ రావు, చిత్తారి ప్రభాకర్, పులి గోవర్ధన్, నర్ర రాజెందర్, కొడిపెల్లి సురేష్, చింకుంట్ల గంగాధర్, షేర్ల రమేష్, మ్యాదరి రమేష్, నీరటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం

కొడిమ్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో 73 మందికి 74లక్షల రూపాయల విలువ గల కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్‌లను, 180 మంది లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే మహాలక్ష్మీ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు పరుస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీ ల్దార్ రమేష్, ఎంపీడీవో స్వరూప, కార్యదర్శి వంశీవర్ధన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, మల్యాల వ్యవసాయ మా ర్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు ముత్యం శంకర్‌గౌడ్, పీసీసీ సభ్యుడు మహిపా ల్‌రెడ్డి, కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లిఖార్జున్‌రెడ్డి, మల్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు, సింగిల్ విండో డైరెక్టర్లు మల్లేశం, నాగభూషణ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ స్వర్ణలత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాజేందర్, స్వామి, చంద్రమొహన్‌రెడ్డి, ప్రసాద్, శోభన్, అజయ్‌గౌడ్ గొల్కోండ రాజు, వినోద్‌రెడ్డి, నర్సయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే సత్యం

● మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన కంకణాల శ్రీకాంత్, డబ్బుతిమ్మయ్యపల్లి గ్రామానికి చెందిన అదరవేని రవి అనే యువకులు విదేశాలలో మృతి చెందాడు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గల్ఫ్ బాధిత సంక్షేమ నిధి నుంచి విడుదలైన 5లక్షల రూపాయల విలువైన చెక్‌లను సోమవారం సాయంత్రం చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం బాధిత కుటుంబాల సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కోరుట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఝాన్సీరోడ్డులో తాళం వేసి ఉన్న ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం... కాలనీకి చెందిన కొండబత్తిని గంగాకిషన్ - అరుణ దంపతులు ఇంటికి తాళం వేసి నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లారు. సోమవారం ఇంటి తలు పులు తెరిచి ఉండడంతో చుట్టు పక్కల వారు గమనించి గంగా కిషన్‌కు ఫోన్ ద్వారా విషయం చేరవేసారు. గంగాకిషన్ సూచన మేరకు బంధువులు ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని సీఐ సురేష్ బాబు తన సిబ్బందితో వచ్చి పరిశీలించారు. పోలీసులు క్లూజ్ టీం సహాయంతో తనిఖీలు నిర్వహించారు. గంగాకిషన్‌ను ఫోన్‌లో సంప్రదించగా బీరువాలో ఐదు తులాల బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదు ఉన్నట్లు తెలిపాడు.

రూ.80వేల నగదు.. వెండి అపహరణ

ఎల్లారెడ్డిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లో తాళం వేసి ఉన్న రాయవేని సురేందర్ ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై రమాకాంత్ సోమవారం తెలిపారు. ఇంట్లో నిల్వ చేసిన రూ.80 వేల నగదుతోపాటు 25 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. గ్రామంలోని సురేందర్ ఈ నెల 24న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి సగ్రారమం రాజన్నపేటకు వెళ్లాడు. సోమవారం తిరిగి ఇంటికి వచ్చే సరికి తాళం పగులకొట్టి కనిపించింది. బీరువాను ధ్వంసం చేసి నగదు, వెండి అభరణాలను ఎత్తుకెళ్లారని తెలిపారు. బాధితుడు సురేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జగిత్యాలలో చోరీ.. నగదు అపహరణ

జగిత్యాల క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని వాణినగర్‌లో చోరీ జరిగింది. గుర్తు తెలియని దొంగలు బోగ కృష్ణహరి అనే వ్యక్తి ఇంటిలోకి చొరబడి బీరువా తలుపులు పగులగొట్టి రూ.20 వేల నగదుతో పాటు తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు అపహరించుకవెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వేలి ముద్రలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మద్యం మత్తులో వాహనం నడిపిన వ్యక్తికి జైలు

జగిత్యాల క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడిపిన కేసులో ఒకరికి పది రోజుల జైలు శిక్ష విధిస్తూ జగిత్యాల కోర్టు న్యాయమూర్తి కరుణాకర్ సోమవారం తీర్పు వెలువరించారు. జగిత్యాల పట్టణానికి చెందిన ఉస్మాన్ షేక్ అనే వ్యక్తి అతిగా మద్యం తాగి అజాగ్రత్తగా వాహనం నడుపుతూ జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై మల్లేశంకు పట్టుబడ్డారు. ట్రాఫిక్ ఎస్సై కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి పది రోజుల జైలు శిక్ష విధించారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

కోరుట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐబీ రోడ్డులో నివాసం ఉంటున్న వ్యాన్ డ్రైవర్ తోట రాజన్న అలియాస్ తోట రాజిరెడ్డి (54) అనే వ్యక్తి ఉరి వేసుకుని సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణానికి చెందిన రాజిరెడ్డి కోరుట్లలో భార్యతో నివాసం ఉంటున్నాడు. కుటుంబ కలహాలతో పాటు మద్యానికి బానిసైన రాజిరెడ్డి సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

నిర్మాణం పూర్తయినా వాడుకలోకి తీసుకురాకపోవడంతో తిమ్మాపూర్ మండలంలోని మహాత్మానగర్ గ్రామంలో వారసంత అధ్వానంగా మారింది. అక్కడ చుట్టు పక్కల ఉన్నవారు వారసనంత వద్ద పశువులను కట్టేసుకుంటున్నారు. ఇతర అవసరాలకు వాడుకోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. లక్షలు వెచ్చించి నిర్మించిన నిర్మాణాలు నిరుపయోగంగా మారడంతో పాటు నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వారసంతల నిర్మాణం చేపట్టగా మహాత్మానగర్, రేణికుంట, నల్లగొండ గ్రామాల్లో నిర్మాణం పూర్తి కాగా నుస్తులాపూర్‌లో మధ్యలోనే పనులు నిలిపివేశారు. కొత్తపల్లి, మొగిళిపాలెంలో పనులు ప్రారంభించకపోవడంతో రద్దు అయ్యాయి. నిర్మాణం పూర్తయిన చోట వారసంతలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా మహాత్మానగర్ కూరగాయల వార సంత ఆవరణ

వారసంత.. ప్రజలకు చింత

- అందుబాటులోకి రాక ప్రజలు, చిరువ్యాపారులకు ఇబ్బందులు
- మహాత్మానగర్‌లో నిరుపయోగంగా నిర్మాణాలు
- పట్టించుకోని పాలకులు

తిమ్మాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పాలకులు తూట్లు పొడు స్తున్నారు. ఈ పథకం కింద లక్షలు వెచ్చించి నిర్మించిన నిర్మాణాలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకుండా వాటిని పట్టించుకోకపోవడంతో అధ్వాన్నంగా మారుతున్నాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా తిమ్మాపూర్ మండలానికి 2022లో మహాత్మానగర్, నుస్తులాపూర్, రేణికుంట, నల్లగొండ, కొత్తపల్లి, మొగిళిపాలెం గ్రామాలలో వారసంతలను నిర్మించిచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటిని నిర్మించడం ద్వారా ప్రజలకు సౌకర్యంతో పాటు చిరు వ్యాపారులకు అనుకూలంగా ఉంటుందని, అంతే కాకుండా దీంతో గ్రామ పంచా యతీలకు కొంత ఆదాయం వస్తుందనే ఉద్దేశ్యంతో వీటిని నిర్మించేందుకు గత పాలకులు సిద్ధం అయ్యారు. కానీ ఇప్పటికీ అవి అందుబాటులోకి రాలేదు. మహాత్మానగర్, రేణికుంట, నల్లగొండ గ్రామాల్లో నిర్మాణం పూర్తి కాగా నుస్తులాపూర్‌లో మధ్యలోనే పనులు నిలిపివేశారు. కొత్తపల్లి, మొగిళిపాలెంలో పనులు ప్రారంభించకపోవడంతో రద్దు అయ్యాయి.



సంత లోపల కట్టేసిన పశువులు

మహాత్మానగర్‌లోని వారసంత అధ్వాన్నం

మహాత్మానగర్ గ్రామ పంచాయతీకి అతి సమీపంలో సుమారు 15లక్షల నిధులతో నిర్మించిన కూరగాయల వారసంత ప్రస్తుతం అధ్వానపరిస్థితిలో ఉంది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుయని పనులు పూర్తి కాకున్నా గత ఏడాది అక్టోబరు 4న ఈ వారసంతను గత ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రారంభించారు. ఆ రోజు వారసంతలో అంతా క్రయవిక్రయ దారులతో నిండుగా కనిపించే విధంగా చేశారు. అంతే మరుసటి రోజు నుంచి తిరిగి ఇప్పటి వరకు దాదాపు సంవత్సరం పూర్తి అయినా అందులో కూరగాయాల విక్రయాలు జరగలేదు. ప్రస్తుతం ఈ వారసంతలో స్థానికులు పశువులను కట్టేస్తున్నారు. గడ్డి పేర్చుకున్నారు బట్టలు ఆరబెట్టుకోవడం, మందు బాబులకు అడ్డాగా మారడంతో పాటు ఇతరాలకు స్థానికులు వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం కూరగాయలు బజార్ ఏరియాలో రోడ్డు పక్కన విక్రయిస్తున్నారు.

ప్రజలకు అందుబాటులోకి తేవాలి :

మహాత్మానగర్ గ్రామంలో లక్షలు వెచ్చించి నిర్మించిన వారసంతను అందుబాటులోకి తేవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వార సంతను నిర్మించడమే ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నిర్మాణం చేయలేదని, రాజీవ్ రహదారికి సమీపంలో ఈ వారసంత నిర్మిస్తే ఇటు స్థానికంగా ఉంటే మత్యకారులకు, కూరగాయల విక్రయదారులకు, ఇతర చిరువ్యాపారులకు జీవనోపాధితో పాటు గ్రామ పంచాయతీకీ కూడా కొంత ఆదాయం వచ్చేదని ప్రజలు అంటున్నారు. రాజీవ్ రహదారికి సమీపంలో ఈ వారసంత ఉంటే రాహదారి వెంబడి వెళ్లే ప్రయాణికులకు కూడా తాజా కూరగాయలు, చేపలు, ఇతర వస్తువులు దొరికేవని ఇప్పటికైనా పాలకులు ఈ వారసంతపై దృష్టి సారించి ఉపయోగంలోని తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. వారసంతకు అనుకులంగా లేని పక్షంలో ఇతర ప్రభుత్వ అవసరాల కోసం నిర్మాణాలు వాడాలని ప్రజలకు కోరుతున్నారు. నిరుపయోగంగా ఉండటంతో నిర్మాణాలు శిథిలావస్థకు చేరుతున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు.



బట్టలు ఆరేసుకుంటున్న స్థానికులు

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

జగిత్యాల క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) :ప్రైవేటు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఓ యువకుడిని మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తి మోసానికి పాల్పడ్డాడు. పట్టణానికి చెందిన వంశీ అనే యువకుడు డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. ఆన్‌లైన్‌లో ఇంటి వద్దనే ఉండి పనిచేసే ఉద్యోగం ఉందంటూ సోషల్ మీడియాలో వచ్చిన ప్రకటనకు వంశీ స్పందించాడు. దీంతో గుర్తు తెలియని వ్యక్తి ఉద్యోగం కావాలంటే రూ. 38 వేలు చెల్లించాంటూ నమ్మించాడు. దీంతో వంశీ గుర్తు తెలియని వ్యక్తికి రూ. 38 వేలను బ్యాంక్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేశాడు. . అప్పటి నుంచి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో మోసపోయానని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

దాడి కేసులో ముగ్గురిపై కేసు

జగిత్యాల క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా కేంద్రంలో స్వీట్ హౌస్ నిర్వహించే వ్యక్తిపై దాడి చేసిన కేసులో ముగ్గురు వ్యక్తులపై జగిత్యాల టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని తహసీల్ చౌరస్తా సమీపంలో స్వీట్ హౌస్ నిర్వహించే పునమ్ అనే వ్యక్తిపై జగిత్యాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు స్వీట్లు కొనుగోలు చేసే సమయంలో అకారణంగా దాడికి పాల్పడ్డారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బైండోవర్ ఉల్లంఘన మహిళకు జైలు

రామగిరి, నవంబరు 25 నవంబరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన బాలసాని సత్తెమ్మ అనే మహిళ బైండోవర్ ఉల్లంఘించడంతో జైలుశిక్ష విధించినట్లు మంథని ఎక్సైజ్ సీఐ రాకేష్‌కుమార్ తెలిపారు. సీఐ వెల్లడించిన వివరాల ప్రకారం.. గతంలో సత్తెమ్మ గుడుంబా విక్రయించగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. బైండోవర్ ఆంక్షలు ఉల్లంఘిస్తూ గుడుంబా అమ్మకాలు కొనసాగిస్తుండగా కేసు నమోదు చేసి రామగిరి తహసీల్దార్ ఎదుట హాజరు పరచగా లక్ష జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోవడంతో తహసీల్దార్ 284 రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సాయి, సిబ్బంది ఉన్నారు.

ఒకరి మరణానికి కారణమైన వ్యక్తి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ వ్యక్తి మరణానికి కారణమైన కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి గ్రామంలో ఉంటున్న రాజస్తాన్‌కు చెందిన కైలాస్‌రాం అనే వ్యక్తిని సోమవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తంగళ్లపల్లి మండలంలోని మండెపల్లి గ్రామ శివారులోని కెసిఆర్‌నగర్‌కు చెందిన మహ్మద్ సిరాజ్(45) అనే వ్యక్తి తన కుటుంబసభ్యులతో ఆటోలో గొల్లపల్లిలోని దర్గాకు వెళ్లి దర్శనం చేసుకొని తిరిగి తన అత్తగారి ఇల్లు అయిన చంద్రంపేటకు వెలుతుండగా ఈ నెల 10న కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి గ్రామంలో ఉంటున్న రాజస్థాన్‌కు చెందిన కైలాస్ రాం అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై మద్యం సేవించి అతివేగంగా వచ్చి ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఆటో పక్కన నిలబడి ఉన్న సిరాజ్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సిరాజ్‌కు తీవ్రగాయాలు కాగా ఈనెల 18న కరీంనగర్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య అఫ్రిన్ ఫిర్యాదు మేరకు కైలాస్ రాంపై కేసు నమోదుచేసి అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు.

ఆరుగురికి ఏడాది జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బాలికను వేధించిన (పోక్సో) కేసులో వేములవాడకు చెందిన దొమ్మాటి ఆనంద్, గొల్లపల్లి శశి, పబ్బ రాజేశ్, గొరవేని నాగరాజు, సయ్యద్ సోహెల్, బొమ్మడి గణేశ్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఇన్‌చార్జి పోక్సో కోర్టు) ఎన్.ప్రేమలత సోమవారం తీర్పు వెల్లడించారని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఎస్పీ వివరాల ప్రకారం... 12 ఏప్రిల్ 2018న దొమ్మాటి ఆనంద్, గొల్లపల్లి శశి, పబ్బ రాజేశ్, గొరవేని నాగరాజు, సయ్యద్ సోహెల్, బొమ్మడి గణేశ్ తనను వేధిస్తున్నారని వేములవాడకు చెందిన బాలిక స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేయగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత ఆరుగురు నిందితులకు శిక్ష విధించారని ఎస్పీ తెలిపారు.

రైతులంతా కదిలారు.. 'కల్వల' గండి పూడుస్తున్నారు



గండి పడి వృథాగా పోతున్న కల్వల ప్రాజెక్టు నీరు



ప్రాజెక్టుకు గండిని పూడ్చుతున్న రైతులు

శంకరపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వీణవంక మండలానికి వరప్రదాయమైన కల్వల ప్రాజెక్టుకు పడ్డ గండిని రైతులు సొంత ఖర్చులతో పూడ్చడానికి సోమవారం పూనుకున్నారు. శంకరపట్నం మండలంలోని కల్వల శివారులో ఉన్న ప్రాజెక్టుకు గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు గండి పడింది. అప్పుడున్న బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాత్కాలికంగా రింగు బండ్ నిర్మాణం చేసి రబీ సీజన్‌లో రైతులకు నీరందించారు. ఈ సంవత్సరం వర్షాకాలంలో కురిసిన వర్షాలకు మళ్లీ గండి పడింది. పారకమున్న రైతులు అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసిన ఫలితం లేకుండాపోయింది. కల్వల ప్రాజెక్టు కింద పారకమున్న కల్వల, వీణవంక మండల రైతులు కొంత సొమ్ము జమ చేసి గండి మరమ్మతు చేసి రబీ సీజన్‌లో సాగు చేసుకోవాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కల్వల ప్రాజెక్టుకు మరమ్మతు చేసి రైతులకు రబీ సీజన్లో సాగునీరు అందించాల్సి ఉంది.

రాజీవ్ రహదారిపై బొగ్గు లారీ బోల్తా



రోడ్డుపై బొగ్గు

సుల్తానాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బొగ్గు లోడ్‌తో వెలుతున్న ఓ లారీ అదుపు తప్పి రాజీవ్ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి బోల్తా పడింది. దాంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సంఘటనలో డ్రైవర్ తదితరులకు స్వల్ప గాయాలయ్యాయి. మహారాష్ట్ర నుంచి బొగ్గు లోడ్‌తో వస్తున్న లారీ సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి వద్ద గల మూల మలుపు వద్ద అదుపు తప్పి డివైడర్ ఎక్కి రోడ్డుపై బోల్తా పడింది. దీంతో లారీలో ఉన్న బొగ్గంతా రోడ్డుపై పడిపోగా రాకపోకలకు ఆటంకం కలిగింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బొగ్గును వేరే లారీ లో లోడ్ చేయించి రాకపోకలను పునరుద్ధరించారు.

మద్యం మత్తులో భార్య, అత్తపై దాడి

వేములవాడ రూరల్, నవంబరు25,(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భార్య, అత్తపై అల్లుడు రోకలితో దాడి చేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిపల్లి గ్రామానికి చెందిన మొగిలి రాముకు కథలాపూర్ మండలం గంభీపూర్ గ్రామానికి చెందిన జలతో వివాహం జరిగింది. వీరికి మూడు సంవత్సరాల కూతురు ఉంది. మద్యానికి బానిసైన రాము తరుచూ భార్యతో గొడవపడుతూ ఉండేవాడు. దీంతో ఆమె కొన్ని నెలలనుండి తన తల్లిగారి ఇంట్లో ఉండేది. 15 రోజుల క్రితం కథలాపూర్ పోలీస్‌స్టేషన్లో కౌన్సిలింగ్ నిర్వహించడంతో పెద్దల సమక్షంలో తిరిగి అత్తగారి ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో తన కూతురును చూడడానికి లచ్చవ్వ ఆదివారం మర్రిపల్లికి వచ్చింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న రాము తన భార్యతోపాటు అత్తపై రోకలిబండతో దాడి చేసాడు. దాడిలో గాయపడ్డ ఇద్దరిని స్థానికులు కరీంనగర్‌కు తరలించారు. రూరల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సుల్తానాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని గట్టేపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. పెద్దపల్లి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో గట్టేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు జి రమ్య, జోయానవాజ్, హఫ్సా ఐమాన్, గౌసియాలు తమ ప్రతిభతో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినిలను ప్రధానోపాధ్యాయురాలు వి అన్నపూర్ణ, పీడీ ప్రణయ్, ఉపాధ్యాయులు అభినందించారు.

మధ్యాహ్నం భోజనంపై నిర్లక్ష్యం వహించిన ఐదుగురు ఉపాధ్యాయులపై చర్యలు

జగిత్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్‌లలో మధ్యాహ్న భోజనం నిర్వహణలో నిర్లక్ష్యంపై ఐదుగురు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటూ కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడంతో పాటు మరో ముగ్గురు ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేశారు. కొడిమ్యాల మండలం చెప్యాల్ జడ్పీహెచ్ఎస్‌లో ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం మధ్యాహ్న భోజనం అమలు జరగడం లేదన్న కారణంతో ఫుడ్ ఇన్‌చార్జిగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ వి వెంకటరమణ రావును సస్పెండ్ చేయడంతో పాటు ప్రధానోపాధ్యాయుడు వెంకటస్వామికి వివరణ కోరుతూ మెమో జారీ చేశారు. మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలలో నాణ్యత లేదన్న కారణంతో పాఠశాల ఫుడ్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయుడు సీహెచ్ కిషోర్‌ను సస్పెండ్ చేయడంతో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి లతను వివరణ అందజేయాలని ఆదేశిస్తూ మెమో జారీ చేశారు. కొడిమ్యాల మండలం చెప్యాల్ గ్రామంలో గల మండల పరిషత్ పాఠశాలలో భోజనం నాణ్యత సరిగా లేదన్న కారణంతో ఫుడ్ ఇన్‌చార్జిగా ఉన్న ఉపాధ్యాయుడు ఎం ప్రవీణ్ కుమార్‌కు మెమో జారీ చేశారు.

భార్య కాపురానికి రావడం లేదని బలవన్మరణం



రాము (ఫైల్)

కథలాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతకుంటకు చెందిన అందె రాము (32) అనే వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం..రాముకు గత ఏడాది కిందట ఇబ్రహీంపట్నంకు చెందిన ఓ యువతితో వివాహమైంది. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు చోటుచేసుకోవడంతో మూడు మాసాల కిందట పుట్టింటికి వెళ్లింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన రాము గ్రామ సమీపంలోని వీర్ల గుట్ల వద్ద ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతూ కేకలు వేయడాన్ని అటువైపు వెళ్తున్న వ్యక్తులు గమనించారు. చికిత్స నిమిత్తం కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం జగిత్యాలకు తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు.

కలెక్టరేట్ ముట్టడికి యత్నించిన మాజీ సర్పంచులు

- అడ్డుకుని అరెస్టు చేసిన పోలీసులు

సుభాష్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ మాజీ సర్పంచులు సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేశారు. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల నుంచి వచ్చే వారిని కరీంనగర్ శివారు ప్రాంతాల్లోనే అరెస్టు చేశారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచులు దశల వారీగా అక్కడికి చేరుకున్నారు. అప్రమత్తమైన పోలీసులు వచ్చిన వారిని వచ్చినట్లుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రూ.700 కోట్లకు వరకు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బకాయిల కోసం తిరుగుతున్నామని, ముఖ్యమంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లామన్నారు. అయినా తమ బిల్లులు విడుదల చేయడం లేదన్నారు. అప్పులు చేసి, బంగారం అమ్మి అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. ఇప్పటి వరకు తమకు రావలసిన బిల్లులు విడుదల చేయలేదన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అప్పుల పాలయ్యామని వాపోయారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ బకాయిలను చెల్లించాలని కోరారు.



కలెక్టరేట్ ముట్టడికి వచ్చిన మాజీ సర్పంచ్‌లను అడ్డుకుంటున్న పోలీసులు

నకిలీ పత్రాలతో ఇల్లు కబ్జా

- ఉన్నతాధికారులను ఆశ్రయించిన బాధితుడు
- పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన పంచాయతీ కార్యదర్శి

గొల్లపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఫోర్జరీ సంతకాలకు నిలయంగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫోర్జరీ సంతకాలతో నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించిన ఓ మహిళ ఏకంగా ఒక ఇంటినే కబ్జా చేయడమే కాకుండా తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో రికార్డుల్లో తన భర్త పేరును ఇంటి యజమానిగా రికార్డుల్లోకి నమోదు చేసుకుంది.. బాధిత వ్యక్తి ఉన్నతాధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు కొద్ది రోజుల క్రితం విచారణ జరపడంతో అసలు విషయం వెలుగుచూసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సదరు బాధ్యులపై పోలీసు స్టేషనల్ ఫిర్యాదు చేయాలని ఇచ్చిన ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శి గొల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

వివరాల్లోకెళితే.. గొల్లపల్లి మండల కేంద్రంలోని ఇంటి నెం 5-88 అనే ఇల్లు ఇటీవలి వరకు మ్యాదరి ఆశయ్య పేరిట ఉండేది. ఆశయ్యకు ముగ్గురు కొడుకులున్నారు. ఒక కొడుక్కి ముంబైలో ఉన్న ఇంటితో పాటు ఉద్యోగం అప్పగించారు. మిగితా ఇద్దరికి గొల్లపల్లిలో ఉన్న సదరు ఇల్లు సమానంగా పంచుకోవాలని తల్లిదండ్రులు తీర్మానించారు. ఆశయ్య 1986లో మృతి చెందగా అప్పటినుంచి 2024 వరకు చిన్న కొడుకైన ఏసుదాసు ఇంటి బిల్లు చెల్లిస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో పెద్ద కొడుకైన స్వామిదాసు ఆశయ్యకు తాను ఒక్కడినే కొడుకునని రెవెన్యూ కార్యాలయంలో ఫోర్జరీ సంతకాలతో నకిలీ పత్రాలు సృష్టించి మల్యాల సబ్-రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇంటిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఇటీవల స్వామిదాసు అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ క్రమంలో చిన్న కొడుకైన ఏసుదాసు ఉపాధి నిమిత్తం ముంబై వెళ్లి కొద్ది రోజుల క్రితం స్వగ్రామానికి తిరిగిరాగా తన కుటుంబంతో కలిసి తన ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించాడు. దీంతో స్వామిదాసు భార్య మ్యాదరి లక్ష్మీ ఈ ఇల్లు తనదని, మీరెలా ఉంటారంటూ ఏసుదాసును ఇంట్లో నుంచి వెళ్లగొట్టినట్లు బాధితుడు కన్నీళ్లపర్యంతమయ్యాడు. తన మీద, తన భార్య పిల్లల మీద దాడి చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన ఎంపీవో సురేష్‌రెడ్డి నకిలీ ధ్రువ పత్రాలతో ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు గుర్తించారు. దీనిపై ఒక నివేదికను తయారు చేసి జిల్లాస్థాయి అధికారికి పంపించగా రికార్డుల్లో నుంచి స్వామిదాసు పేరును తొలగించి యథాతదంగా నమోదు చేయాలని, సహకరించిన సిబ్బందిపై, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు గొల్లపల్లి పంచాయతీ కార్యదర్శి మధుసూదన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపారు.

పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయాలి

● హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్

సుభాష్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లో తెలంగాణ రైతు సంక్షేమ సమితి వార్షికోత్సవ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కనీస మద్దతు ధర చెల్లించినపుడే రైతుకు న్యాయం జరుగుతుందన్నారు. 50 సంవత్సరాలు నిండిన రైతులు, కౌలు రైతులు, రైతు కూలీలకు నెలకు రూ.15 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. ప్రతి రైతుకు బీమాతో పాటు పంట బీమా కల్పించాలని, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలను ఉత్పత్తి చేసే సంస్థలపై కఠిన చర్యలు తీసుకొని వాటి వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. సేంద్రియ వ్యవసాయానికి ప్రభుత్వం అన్ని రకాల ప్రోత్సాహకాలు ఇవ్వాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ఇస్తున్న పరిహారాన్ని రెట్టింపు చేయాలని, ఆ పరిహారాన్ని సంబంధిత కుటుంబానికి 30 రోజుల్లో అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు అందించే రుణ సాయం, రైతు బంధు, రుణమాఫీ, సబ్సిడీలు కౌలు రైతులకు కూడా ఇవ్వాలని కోరారు. గిడ్డంకులు ఏర్పాటు చేసి రైతు పంటలు నిల్వచేయడానికి అవకాశం కల్పించాలన్నారు. అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యం, పత్తిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పాడి పశువులకు బీమా కల్పించాలని, ఆదివాసీల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. పరిశ్రమల కోసం ప్రభుత్వం భూసేకరణ చేయవలసివస్తే, భూమికి బదులుగా మరోచోట వ్యవసాయభూమి ఇవ్వాలని చంద్రకుమార్ డిమాండ్ చేశారు. డిసెంబరు 1న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే తెలంగాణ రైతు సంక్షేమ సమితి ఐదో వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వర్ల వెంకటరెడ్డి, సుతారి లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

రామగుండం రైల్వేస్టేషన్‌లో పోలీసుల తనిఖీలు



దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

అంతర్గాం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రామగుండం రైల్వేస్టేషన్‌లో గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ అధ్వర్యంలో సివిల్, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, స్పెషల్ పార్టీ పోలీసులు సంయుక్తంగా సోమవారం తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్‌లతో పాటు దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేసేందుకు పోలీస్ శాఖ అధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగంతో యువత నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందని గంజాయి రవాణాను అరికట్టేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐలు ప్రవీణ్ కుమార్, ఇంద్రసేనారెడ్డి, బుర్ర సురేష్‌గౌడ్, ఎస్‌ఐలు వెంకట స్వామి, సంధ్యారాణి, జీఆర్‌పీ ఇన్‌చార్జి తిరుపతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటక శోభకు శ్రీకారం



ఎల్. మడుగు పక్కన ఉన్న కొండ

ఎల్. మడుగులో మొసళ్లు

- గోదావరి నదిలో రెండు గుట్టల మధ్య సహజ సిద్ధంగా వెలసిన ఎల్. మడుగు
- పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి సన్నాహాలు
- ఎల్. మడుగు వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి నేడు శంకుస్థాపన

మంథని, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గలగల పారే గోదావరి నది ప్రవాహ పరుగులకు అడ్డుకట్టలా రెండు గుంటల మధ్య సహజ సిద్ధంగా ఏర్పడిన ఎల్. మడుగు (మొసళ్ల సంరక్షణ కేంద్రం) ప్రకృతి అందాలకు ప్రభుత్వం పర్యాటక శోభను తీసుకురావటానికి శ్రీకారం చుట్టింది. విలువైన మత్స్య, వన సంపదలకు నెలవుగా ప్రకృతి ప్రేమికులను ఇట్టే ఆకర్షించే ఎల్. మడుగును పర్యాటక కేంద్రగా అభివృద్ధి చేయటానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు అనేక అభివృద్ధి పనులు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. ఇందులో భాగంగా ప్రభుత్వం నుంచి ఇటీవల మంజూరైన రూ. 7 కోట్ల నిధులతో మంథని-కాటారం ప్రధాన రహదారి నుంచి వయా ఖానాపూర్ మీదుగా ఎల్. మడుగు ఉన్న గోదావరినది వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంగళ వారం శంకుస్థాపన చేయనున్నారు. తొలుత డబుల్ రోడ్డు పనులు పూర్తిచేసిన తర్వాత గోదావనదిలో, తీరంలో పర్యాటకులు ప్రకృతి ఒడిలో సేద తీరేలా పలు అభివృద్ధి పనులు, ఇతర వసతి సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నారు.

ఇటీవల రాష్ట్ర టూరిజం ఎండీ ప్రకాష్‌రెడ్డి సందర్శించి చేపట్టాల్సిన పనులు గురించి ఆరా తీశారు. ఈ మేరకు బోటింగ్, కాటేజీలు, ఇతర వసతులు గురించి ప్రతిపాదనలు తయారు చేశారు. ప్రకృతి సోయగాలకు నిలువెత్తు నిదర్శనంగా విరాజిల్లుతున్న ఎల్. మడుగు ప్రత్యేకత ఇప్పుడిప్పుడే ప్రాచుర్యంలోకి వస్తోంది. అంతరించిపోతున్న మొసళ్ల పెంపక కేంద్రంగా, మత్స్య సంపద బాండాగారంగా ఎల్. మడుగు విరాజిల్లుతోంది. ఎల్. మడుగు ఇటు ప్రకృతి సోయగాలు పర్యాటక కేంద్రంగా ఆహ్లాదాన్ని పంచే జలాశయంగా కీర్తి గడించే అవకాశం ఉంది.

రెండు గట్టల మధ్య ఏర్పడ్డ మడుగు..

మంథని నుంచి తూర్పు వైపు మూడు కిలో మీటర్ల దూరంలో ఖానాపూర్ గ్రామం శివారులో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల సరిహద్దుగా ఉన్న రెండు గుట్టలు అతి దగ్గరగా ఉండి గోదావరి నది ప్రవాహానికి అడ్డు తగలడంతో సహజ సిద్ధంగా మడుగు ఏర్పడింది. దాదాపు 50 మీటర్లకు పైగా మడుగు లోతుగా ఉన్నట్లు అంచనా. దీంతో ఎంతటి వర్షాభావ పరిస్థితులో నైనా ఎల్. మడుగు నీరు పుష్కలంగా నిల్వ ఉంటుంది.

అడవులు, గుట్టలతో ఎల్. మడుగు అందాలు..

నిత్యం నిండు కుండలా ఉండే మడుగుకు ఇరువైపులా ఉన్న గుట్టలపై పచ్చదనం పరుచుకునేలా చెట్లు ఉన్నాయి. ఇవతలి వైపు, అవతలి వైపు ఉన్న ఎత్తైన గుట్టలు కనువిందు చేస్తాయి. గుట్టలపై నుంచి కిందికి చూస్తే జలాశయాన్ని తలపించే ఎల్. మడుగు, పక్కలకు చూస్తే కింద నేలపై పచ్చని తివాచి పర్చినట్లు కన్పించే పొలాలు, పైన భారీ వృక్ష సంపద దృశాలు అందరినీ ఆకట్టుకుంటాయి.

స్థానికంగా ప్రాచుర్యంలో ఉన్న పురాతన కథనం ప్రకారం.. ఎల్. మడుగు ఇవతలి వైపు గ్రామానికి చెందిన ఓ వివాహిత అవతలి వైపు గుట్ట సమీప ప్రాంతంలో ఉన్న వ్యక్తితో ఉన్న పరిచయం కారణంగా నిత్యం ఎండుకుండను పొట్ట క్రింద పెట్టుకొని ఈదు

ఎల్. మడుగు చరిత్ర..

కుంటూ మడుగు దాటి వెళ్ళి తిరిగి వచ్చేది. సదరు వివాహిత ప్రవర్తనతో విసుగు చెందిన భర్త కాల్చని కుండను ఆమె కుండ తీసుకొని వెళ్లే స్థానంలో పెట్టడంతో గమనించకుండా అదే కుండను తీసుకొని ఈదుకుంటూ మడుగు దాటుతుండగా మార్గ మధ్యలో కుండ పూర్తిగా విచ్చుకు పోయి వివాహిత మడుగులో పడి మృతి చెందడంతో ఎల్. మడుగుగా ఈ పేరు వచ్చినట్లు స్థానికులు చెప్పుకుంటారు.

మొసళ్ల పెంపక కేంద్రం..

గోదావరినదికి అవతలి వైపు ఉన్న మంచిర్యాల జిల్లా, మంచిర్యాల ఫారెస్టు రేంజ్ పరిధిలోని శివ్వారం వన్యప్రాణి అభయారణ్య కేంద్రంగా ఉన్న ఎల్. మడగులో అటవీశాఖ వారు మొసళ్ళ సంరక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం మడుగులో ఉన్న మొసళ్లను సంరక్షించడంతో పాటు అవి పెట్టే గుడ్లు పిల్లలు అయ్యేంత వరకు రక్షించి నదిలో సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. మడుగులోని మొసళ్ల ఏకాంతానికి భంగం కలగకుండా, ఇతరుల నుంచి వాటికి ముప్పు వాటిల్లకుండా చర్యలు తీసుకుంటున్నారు. దాదాపు 60 నుంచి 70వరకు మొసళ్లు మడుగులో ఉన్నట్లు, వీటిలో కొన్ని 50 సంవత్సరాలకు పైగా వయస్సున్నట్లుగా అంచనా. ప్రశాంతంగా ఉండే సమయాల్లో ఉదయం, సాయంత్రం నది తీరంలో ఉండే రాతి బండలు, ఒడ్లపైకి మొసళ్లు వచ్చి సేద తీరుతాయి. ఈ సమయంలో వీటిని సహజ సిద్ధంగా చూడటం వీనుల విందే.

విలువైన మత్స్య సంపద..

విలువైన మత్స్య సంపదకు నిలయంగా ఉంది. బొమ్మెలు, రొయ్యలు, కొర్ర మట్టలు, రావులు, బుడ్డ పరకలు, అలుగులు, జెల్లలు లాంటి వివిధ రకాల చేపలు దొరుకుతాయి. గోదావరి నది మత్స్య సంపదకు మంచి రుచి ఉంటుండంతో ఇక్కడ కొంత మంది చేపలు మంథని, గోదావరిఖని, సెంటినరీకాలనీ, భూపాలపల్లి, కాటారం, అవతలి వైపు మంచిర్యాల, శ్రీరాంపూర్ ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

పురాతన ఆలయం, చారిత్రక కట్టడం..

గోదావరి నదిలోని ఎల్. మడుగు అవతలి వైపు మంచిర్యాల జిల్లా శివారులో ఉన్న గుట్టపై పురాతన ఆలయం, చారిత్రక కట్టడాలను చూస్తే కనువిందు చేస్తాయి. అనాధిగా జన సంచారం లేక ప్రకృతి పరంగా, ధ్వంసం కావడంతో పాటు గుప్త నిధుల కోసం దుండగులు ధ్వంసం చేసిన శిథిలమైన శివాలయం, ఇతర కట్టడాలు నేటికీ దర్శనమిస్తున్నాయి. కాకతీయ కళా వైభవానికి అద్దం పట్టేలా గుట్టలోని ఆలయాన్ని, ఇతర నిర్మాణాలను మలిచిన తీరు అందరినీ ఆకర్షిస్తున్నాయి.



గోదావరినదిలో ఎల్ మడుగు ప్రాంతం

మ్యూచువల్ ఫండ్స్ పేరుతో రూ.70 వేలకు టోకరా

కరీంనగర్ క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డుతో మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెడితే మంచి లాభాలు వస్తాయని నమ్మించి మోసానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ టూటౌన్ పోలీసు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన మొగిలి లక్ష్మయ్య అనే వ్యక్తికి ఈ నెల 19న ఒక బ్యాంకు నుంచి మనూష అనే మహిళ ఫోన్ చేసి మొదట లోన్ కావాలా అని అడిగింది. తనకు అవసరం లేదని లక్ష్మయ్య అనడంతో క్రెడిట్ కార్డు ఉంటే మ్యుచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెడితే రెండు లక్షల రూపాయలు లాభం వస్తుందని చెప్పి క్రెడిట్ కార్డు వివరాలు తీసుకుంది. అతని క్రెడిట్ కార్డు నుంచి 66,998 రూపాయలు కట్ అయ్యాయి. డబ్బులు ఎందుకు కట్ అయ్యాయని అడిగితే మూడు రోజుల్లో జమ అవుతాయని చెప్పింది. కానీ డబ్బులు జమ కాకపోవడంతో మోసపోయానని మొగిలి లక్ష్మయ్య గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కాల్వశ్రీరాంపూర్, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెగడపల్లికి చెందిన కుమార్ (40) అనే వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుమార్ కొన్నిరోజులుగా గుండె సమస్యతో బాధపడుతున్నాడు. తన ఆరోగ్యం బాగుచేయించుకోవడం కోసం అప్పులు చేశాడు. అప్పులు తీరక, ఆరోగ్యం బాగుపడకపోవడంతో తీవ్ర మనస్తాపం చెంది ఈ నెల 20వ తేదీన తన ఇంటిలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృత్యువాతపడ్డాడు. మృతుడికి భార్య ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

వీణవంక, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఘన్ముక్ల గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న హరీష్ అనే విద్యార్థి జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ షాబీర్‌పాషా సోమవారం తెలిపారు. ఈ మేరకు సోమవారం విద్యార్థిని ప్రిన్సిపాల్ మోయిజ్ బేగ్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ మధు జాన్సన్‌లు అభినందించారు.

ఆలయాల్లో కార్తీక సందడి



గోదావరిలో దీపాలు వదులుతున్న భక్తులు



గోదావరి హారతి



స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

- భక్తజన సంద్రంగా రాజన్న క్షేత్రం
- ధర్మపురి క్షేత్రంలో ఘనంగా పూజలు
- గోదావరిలో దీపాలు వదిలిన మహిళలు

వేములవాడ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న క్షేత్రం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు ముందుగా రాజరాజేశ్వర స్వామికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. కోడెమొక్కు చెల్లించుకునేందుకు సుమారు ఐదు గంట లపాటు భక్తులు క్యూలైన్‌లో నిరీక్షించారు. ధర్మదర్శనం క్యూలైన్‌లో స్వామి వారి దర్శనానికి వెళ్లిన భక్తులు మూడు నుంచి నాలుగు గంటల సమయం పట్టగా శీఘ్రదర్శనం క్యూలైన్‌లో వెళ్లిన భక్తులకు రెండు గంటల సమయం పట్టింది. సుమారు లక్ష మంది వరకు భక్తులు స్వామివారిని దర్శించు కున్నట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో భక్తులు రాజన్న ఆలయానికి పోటెత్తారు. వేములవాడకు భారీగా తరలివచ్చిన భక్తులు స్వామివారి దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలో కుటుంబ సభ్యులతో కలిసి కార్తీక దీపాలను వెలిగించారు.

బద్దిపోచమ్మ ఆలయంలో రద్దీ

రాజన్న ఆలయానికి ఆదివారం వచ్చిన భక్తులు సోమ వారం ఉదయం రాజన్నను దర్శించుకొని అనంతరం మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకొని డప్పుచప్పుళ్లతో శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయా నికి చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో గంట పాటు క్యూలైన్‌లో నెత్తిన బోనాలతో భక్తులు బారులు దీరారు. ఆలయంలోకి చేరుకున్న భక్తులు అమ్మవారికి నైవే ద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ధర్మపురి, (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో ఆఖరి సోమవారం కార్తీక సందడి నెలకొంది. కార్తీక మాసం సందర్భంగా భారీగా భక్తులు తరలి వచ్చారు. లక్ష్మీ నృ సింహస్వామి, అనుబంధ రామలింగేశ్వ స్వామి, అక్కపెల్లి రాజ రాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి నదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణ దారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు, పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు.



వేములవాడలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

24వ రోజు గోదావరి హారతి

కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 24వ రోజు సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, గోదా వరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు నదీ మాతకు ప్రత్యేక పూజలు చేసి హారతి ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, పాల్గొన్నారు.



భక్తులతో కిక్కిరిసిన వేములవాడ రాజన్న ఆలయ ప్రాంగణం

సేంద్రియ పద్ధతిలో తైవాన్ జామ సాగు

లాభాలు ఆర్జిస్తున్న యువరైతు



మల్లేశం సాగు చేస్తున్న తోటలోని తైవాన్ జామ కాయలు

గంభీరావుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతిలో తైవాన్ జామ సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నాడు గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన బొంగు మల్లేశం అనే యువ రైతు. మల్లేశం తనకున్న రెండెకరాల్లో వరి సాగు చేసేవాడు. సంప్రదాయ పంటలు కాకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేపట్టాలని ఆలోచిం చాడు. అధిక సాంద్రత పద్ధతిలో జామ తోటను సాగు చేయాలని నిర్ణ యించుకున్నాడు. రెండేళ్ల కిందట ఖమ్మం జిల్లా అశ్వరావుపేట నుంచి 700 తైవాన్ జామ మొక్కలను 30 రూపాయల చొప్పున కొనుగోలు చేసి తెచ్చాడు. ఎకరం భూమిలో మొక్కల వరుస మధ్య మీటరు దూరం ఉండేలా నాటాడు.

రసాయన ఎరువులు క్రిమిసంహారక మందులు వాడకుండా జీవామృతం కోళ్ల ఎరువు, పశువుల పేడ, వేప పిండి, వేపానునూనెతో పూర్తిగా సేంద్రియ పద్ధతిలో తైవాన్ జామ సాగు చేస్తున్నాడు. పొలంలో కలుపు లేకుండా ఎప్పటికప్పుడు తొలగి స్తున్నాడు. కోతులు, అడవి పందుల బెడద రక్షించుకునేందుకు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశాడు. జామ మొక్కలు నాటిన నాలుగు నెలలకు కాతకు వచ్చింది. ఏడాదికి మూడు సార్లు పంట చేతికొస్తుండగా క్రాప్‌కు పది క్వింటాళ్ల దిగుబడి సాధిసున్నట్లు, కిలో జామ రూ.60 చొప్పున విక్రయిస్తున్నట్లు రైతు పేర్కొంటున్నాడు.

మంచి లాభాలు: బొంగు మల్లేశం, యువరైతు, నర్మాల

తైవాన్ జామకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. జామ కాయల అమ్మకాలతో లాభాలు వస్తున్నాయి. ఎకరానికి పంటకు సగటున 10 క్వింటాళ్ల జామ కాయలు పండిస్తున్నా. మార్కెట్‌లో కిలో జామకు ధర 60 రూపాయలు పలుకుతోంది. పెట్టుబడి పోను పంటకు రూ.50 వేల ఆదాయం వస్తోంది.



జేఎన్టీయూలో జాతీయ స్థాయి వర్క్‌షాప్

రామగిరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 29, 30 తేదీల్లో రెండు రోజుల పాటు సీఎస్ఈ, సీఎస్ఎం విద్యార్థులతో జాతీయస్థాయిలో నిర్వహించే వర్క్‌షాప్ బ్రోచర్‌ను ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. మిషన్ లర్నింగ్ అండ్ బిగ్ డేటాపై జరిగే వర్క్‌షాప్‌లో పాల్గొనే విద్యార్థులు రూ.400 రిజిస్ట్రేషన్ చెల్లిస్తే భోజనంతో పాటు వసతి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం 7981686589, 8688368187 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆఫీసు సూపరింటెంటెండ్ రవికుమార్, కన్వీనర్ తిరుపతి, ఫ్యాకల్టీ ఓ-ఆర్డినేటర్ నరహరి, శ్రీనివాస్‌రావు, వంశీకృష్ణ, శ్రీధర్, స్టూడెంట్ కో-ఆర్డినేటర్ సందీప్‌కుమార్, అంకిత, దేవి శరణ్, సహస్ర తేజ, విద్యార్థులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది

నేడు మండలంలో ప్రభుత్వ విప్ పర్యటన

పెగడపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలంలో పలు అభివృద్ధి పనుల శంఖుస్థాపనలకు గాను ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఏడుమోటల పల్లి తండా వరకు రూ. 2 కోట్లతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణ పనులకు, కేజీబీవీ పాఠశాల ముందర రూ. 12 లక్షలతో సిమెంట్ రోడ్డు, స్వయంభూ రాజన్న ఆలయం ముందు రూ 15 లక్షలతో సిమెంట్ రోడ్డు, జడ్పీ హైస్కూల్ ఆవరణలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు, టాయిలెట్ల నిర్మాణాలకు, నామాపూర్‌లో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు శంఖుస్థాపనలు చేయనున్నట్లు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఐఎంఏ పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాల అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏ ఎమ్మార్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ యాంటీ బయోటిక్స్ రెసిస్టెన్స్ తగ్గించడం ఎలా, యాంటీ బయోటిక్స్ రెసిస్టెన్స్ గల కారణాలపై అవగాహన పోస్టర్‌ను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు గూడూరి హేమంత్, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, మోర సుమన్, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా దీపోత్సవం

కోరుట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొత్తబస్టాండ్ ప్రాంతంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో కార్తిక సోమవారం పురస్కరించుకుని దీపోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దేవాలయ పురోహితులు ఉద్దంటి శ్యాంసుందర్, శ్రీధర్, శ్రీకాంత్ రుద్రాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించంగా మహిళలు దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఈవో విక్రం, సిబ్బంది నర్సయ్య, దేవాలయ మాజీ చైర్మెన్ గుంటుక జ్ఞానేశ్వర్, మాజీ దర్మకర్తలు గాండ్లోజీ రాజయ్య, అన్నం హరీష్, గాండ్లోజీ రాజేందర్ - లత పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం సరిగ్గా లేదని...

జగిత్యాలలో విద్యార్థుల ఆందోళన

జగిత్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం ఆరెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజనం సరిగ్గా పెట్టడం లేదని, నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్న వంట మనుషులను మార్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆందోళన చేపట్టారు. జిల్లా కేంద్రంలోని జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. సుమారు అరగంట పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చేయడంతో రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం ప్రజావాణిలో కలెక్టర్ సత్యప్రసాద్, డీఈవో జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి గోడు వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు సమస్యలను వివరించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్న వంట మనుషులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులకు సరిపడా భోజనం పెట్టడం లేదని, పలు సందర్భాల్లో పురుగుల అన్నం, వెంట్రుకలు వస్తున్న భోజనం వడ్డించారని వివరించారు. పలుమార్లు ఈ విషయమై ప్రశ్నిస్తున్న విద్యార్థులను అకారణంగా టార్గెట్ చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని వాపోయారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులపై దురుసుగా వ్యవహరిస్తూ, ఇష్టారీతిన మాట్లాడుతున్నారని విద్యార్థులు వాపోయారు. చాలీచాలని భోజనం పెట్టడంతోపాటు భయబ్రాంతులకు గురిచేస్తున్న వంట మనుషులను మార్చాలని డిమాండ్ చేశారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

మంత్రిని కలిసిన ఏఎంసీ చైర్మన్



మంత్రి శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న మెట్‌పల్లి ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్

మెట్‌పల్లి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోని మంత్రి క్వార్టర్స్‌లో ఆయన నివాసంలో టీపీసీసీ డెలిగేట్ మెంబర్ కల్వకుంట్ల సుజిత్‌రావుతో కలిసి మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో ఘనంగా సన్మానించారు. తనపై నమ్మకంతో వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా నియమించినందుకు మంత్రి శ్రీధర్‌బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ యార్డు కృషికి సహకరించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. అనంతరం టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్‌ను కలిసి శాలువతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాకిటి సత్యంరెడ్డి, ఖుతుబొద్దిన్ పాషా, కూన రాకేష్, గిరి, మహబూబ్, కారం మారుతి, గోరుమంతుల నవీన్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి

మెట్‌పల్లిటౌన్ : మెట్‌పల్లి పట్టణంలోని ముస్లిం మైనారిటీకి సంబంధించిన పలు అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరుతూ సోమవారం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఎండి ఖుతుబొద్దిన్ పాషా ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కోరారు. హైదారాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. పట్టణంలోని ముస్లిం మైనారిటి షాదిఖానాకు 2005లో నిధులు మంజూరయ్యాయాని కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో పనులు జరుగడం లేదని వెంటనే నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

హాస్టల్స్ మెరుగుపడేనా..?

(5వ పేజీ తరువాయి)

తమకు కేటాయించిన హాస్టల్, గురుకులం, కేజీబీవీని వారానికోసారి సందర్శించాల్సి ఉంటుంది. భోజనంలో నాణ్యత లేకుంటే కలెక్టర్‌కు నివేదించాల్సి ఉంది. అలాగే మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులు హస్టళ్లలో వంట మనుషులతో కూడా మండల కమిటీలు సమావేశమై వారికి భోజనం లో నాణ్యతపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది. అక్క డ వసతులు భోజనం నాణ్యత మెరుగయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రత్యేకాధికారిదేనని ప్రభుత్వం మార్గదర్శకాలలో స్పష్టం చేసింది. మండల, జిల్లాస్థాయి అధికారుల కమిటీలు ఆయా హస్టళ్లను సందర్శించి పర్య వేక్షిస్తాయి. తద్వారా నాణ్యమైన భోజనం అంద డంతో పాటు సౌకర్యాలు మెరుగుపడతాయని ప్రభుత్వం బావిస్తోంది.

అదనపు కలెక్టర్ చైర్మన్‌గా...

జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చైర్మన్‌గా, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కో చైర్మన్‌గా, జిల్లా పౌరసరఫరా అధికారి, జిల్లాపౌరసరఫరాల సంస్థ మేనేజర్, ఫుడ్ సేఫ్టీ అధికారి, జిల్లా విద్యాధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, బీసీ కార్పొరేషన్ అధికారి, గిరిజన సంక్షేమ అధికారి, జిల్లా వైద్యాధికారి, డీసీహెచ్ ఎస్‌లతో పాటు ఆయా గురుకులాల ఆర్‌సీవోలతో జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. మండల స్థాయిలో ప్రత్యేకాధికారి, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో, ఎంఈవోలతో కమిటీ ఏర్పాట య్యింది. మండల స్థాయి అధికారుల కమిటీ రానున్న రెండు, మూడు రోజుల్లో తమ పరిధిలోని సంక్షేమ హస్టళ్లు, గురుకులాలు, కేజీ బీవీలను సందర్శించి ఆయా సంస్థలలో విద్యార్థుల హజరు, వారికి అందిస్తున్న భోజనం, వసతుల వివరాలతో జిల్లా అధికారులకు నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. సంబంధిత నివేదిక ఆధారంగా ప్రభుత్వానికి ప్రత్యేక నివేదికను సమర్పించడానికి అధికార యంత్రాంగం ప్రయత్నాలు చేస్తోంది.

పకడ్బందీగా హాస్టల్స్ నిర్వహణ

సత్య ప్రసాద్, జిల్లా కలెక్టర్



ప్రభుత్వం లక్ష్యం మేరకు హాస్టల్స్ పకడ్బందీగా నిర్వహిస్తున్నాము. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో గానీ, నిబంధనల మేరకు మధ్యాహ్న భోజనం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాము. ప్రత్యేకాధికారులను నియమించి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరిపేలా చర్యలు తీసుకుంటున్నాము.

పంక్చర్ షాపును ఢీకొట్టిన కారు

ధర్మపురి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపట్నం వద్ద కారు పంక్చర్ షాపును ఢీకొట్టిన ఘటనలో సోమవారం ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వరంగల్ జిల్లా నుంచి ధర్మపురి దైవ దర్శనానికి కారులో నలుగురు వ్యక్తులు వస్తున్నారు. రాయపట్నం వద్ద మూలమలుపు ఉండగా ఒకేసారి రహదారిపైకి ఒక ఎద్దు రావడంతో అదుపుతప్పిన కారు పక్కనే ఉన్నటైర్‌పంచర్ దుకాణాన్ని ఢీ కొట్టింది. దుకాణదారు లాల్‌బాబు అనే వ్యక్తికి ఢీకొట్టగా బలమైన గాయాలయ్యాయి. కారులోని బెలూన్లు ఓపెన్ కావడంతో పెను ప్రమాదం తప్పింది. లాలుబాబుతో పాటు కారులోని ఒక వ్యక్తిని 108 సిబ్బంది జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు.

హిందూ జాగరణ రథయాత్ర

మల్యాల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):హిందూ జనజాగృతి కోసం చేపట్టిన ధర్మజాగరణ రథయాత్ర సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లో కొనసాగింది. ఆయా గ్రామాల్లో ప్రజలు మంగళహారతులతో స్వాగతం పలికారు. పలువురు మాట్లాడుతూ సనాతన ధర్మం కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సిద్దం మహేశ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవు

జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్

మెట్‌పల్లి రూరల్, నవంబర్, 25 (ఆంధ్రజ్యోతి) : గురుకులంలోని పరిసరాల పరిశుభ్రతను పాటిస్తే విద్యార్థులకు ఎలాంటి వ్యాదులు దరికి చేరవని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని పెద్దాపూర్ గ్రామ శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మండల వైద్యాధికారి డాక్టర్ అంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శిం చారు. గురుకులం పరిసరాలు, తరగతి గదులు, భోజనల శాల, వంట గదులను పరిశీలించారు. అనంతరం వైద్య శిబిరంలో విద్యార్థులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీతాకాలం సీజనల్ వ్యాధులు దరిచేరకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను ఉపాధ్యాయ, అధికారులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. చలి ఎక్కువగా ఉన్నందున విద్యార్థులకు వేడిగా ఉన్న ఆహారాన్ని అందించాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గురుకులం సూపర్‌వైజర్ నాగభూషణం, ఉపాధ్యాయులు, ఏఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, పాల్గొన్నారు.



పెద్దాపూర్ గురుకులంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

మెట్‌పల్లి రూరల్, నవంబర్, 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ఆహార విషయంలో ఎటువంటి అశ్రద్ధ చేయొద్దని, నాణ్యమైన ఆహారాన్ని మాత్రమే అందించాలని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష, మెట్‌పల్లి ఆర్డీవో శ్రీని వాస్ సూచించారు. సోమవారం మండలంలోని పెద్దాపూర్ గ్రామ శివారులోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా ఇరువురు అధికారులు వేరువేరుగా తనిఖీ చేశారు.

గురుకులంలోని వంట గది, సరకులు, పాత్రలు, కూరగాయాలు పరిశీలించారు. పురుగు పట్టిన బియ్యం, పప్పు దినుసులతో పటు కుళ్ళిన కూరగాయాలు అక్కడ ఉండడంతో ఇన్‌చార్జి వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సరుకులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అందించే భోజనంలో ఎలాంటి అశ్రద్ధ చూపకుండా నాణ్యమైనది ఉండాలే చూడాలన్నారు. మెనూ ప్రకారం ప్రతీ విద్యార్థికి సక్రమంగా ఆహారం అందించాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ ఉమేష్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శిపై ఫిర్యాదు

కొడిమ్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెప్యాల గ్రామ పంచాయతీ కార్యదర్శి నెర్మెట్ల స్వామి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాడని సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు మాజీ సర్పంచు అక్కపల్లి రాజేశం తెలిపారు. చెప్యాల గ్రామంలో గత పాలక వర్గంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసిన తెట్టె మహిపాల్ 2023న గుండె పోటుతో మృతి చెందాడు. అతడు పని చేసిన జీతం డబ్బులు చెల్లించాలని మహిపాల్ భార్య అడగడంతో కార్యదర్శి నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడని ఫిర్యాదులో పెర్కొన్నట్లు తెలిపాడు. ఈ విషయమై కార్యదర్శి నెర్మెట్ల స్వామిని వివరణ కోరగా నిధులు లేని కారణంగా మృతుడి కుటుంబ సభ్యులకు జీతం చెల్లించలేదన్నారు.

ఆలయ కమిటీ క్యాషియర్‌పై చర్యలు తీసుకోవాలి

మెట్‌పల్లిటౌన్, నవంబర్ 25(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని కోదాండ రామలయంలో గతంలో ఆలయ కమిటీ క్యాషియర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన టి. శ్రీనివాస్ సినియర్ అసిస్టెంట్ ఎస్సారెస్పీ డివిజన్ నెం-2లో విధులు నిర్వహిం చిన శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం రామలయ నూతన కమిటీ సభ్యులు ఎస్సారెస్పీ అధికారులకు ఫిర్యాదు చేశారు. నూతనంగా ఏర్పడిన ఆలయ కమిటీ సభ్యులు పలు దఫాలుగా సమావేశం ఏర్పాటు చేసి ఆలయ కమిటీ జమా, ఖర్చులు అప్పగించాలని కోరినా స్పందించడం లేదన్నారు. శ్రీనివాస్‌పై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు జెట్టి లింగం, నాయకులు ఎర్రోళ్ల హన్మండ్లు, నేమూరి లక్ష్మయ్య, శ్రీకర్‌గౌడ్, కైలాస్, జెట్టి లక్ష్మణ్ పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

కథలాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని అంబేద్కర్ మాల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కథలాపూర్ పోలీసులకు నిందితులను గుర్తించి శిక్షించాలంటూ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బత్తుల నరేశ్, స్వామి, శంకర్, నరేశ్, మోహన్ ఉన్నారు.

ఎన్ఆర్ఐ పాలసీ పరిహారం అందజేయాలని దరఖాస్తు

మెట్‌పల్లి రూరల్, నవంబర్, 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎన్ఆర్ఐ పాలసీ కింద్ర పరిహారం అందజేయాలని మెట్‌పల్లి తహసీల్దార్‌కు బాధితులు దరఖాస్తు అందజేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వేంపేట గ్రామానికి చెందిన బాధిత కుటుంబ సభ్యులు దరఖాస్తును తహసీల్దార్ శ్రీనివాస్‌కు అందజేశారు. వేంపేట గ్రామానికి చెందిన నిరుపేదైన మారంపల్లి సుధీర్ ఇటీవల బెహరన్‌లో అప్పుల బాధతో ఆత్మహత్య పాల్పడ్డాడని, సుధీర్ మృతితో ఆయన కుటుంబం ఇబ్బందులో ఉందన్నారు. ఎన్ఆర్ఐ పాలసీ కింద బాధిత కుటుంబానికి రూ. 5లక్షల పరిహారం అందజేసి ఆదుకోవాలని తహసీల్దార్‌ను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మారంపెల్లి రమేష్, రాజశేఖర్, బాధిత కు టుంబ సభ్యులు, తదితరులు పాల్గొనారు.

బస్సు, వ్యాన్ ఢీ

కోరుట్ల రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోహన్‌రావుపేట గ్రామంలోని జాతీయ రహదారిపై బస్టాండ్ సమీపంలో బస్సు, లోడింగ్ వ్యాన్ ఢీ కోట్టుకున్నాయి. కోరుట్ల నుంచి జగిత్యాల వైపు వెలుతున్న లోడింగ్ వ్యాన్ జగిత్యాల నుంచి కోరుట్ల వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుఎదురుగా ఢీకొన్నాయి. బస్సులో ఉన్న ప్రయాణికులతో పాటు వ్యాన్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయినట్లు స్థానికులు తెలిపారు.

విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోని పరిశీలన జరిపారు. గమనించిన స్థానికులు గ్రామాల పాలైన వారిని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రి ప్రత్యేక వాహనం ద్వార తరలించారు.

కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి

వామపక్ష నాయకులు

కోరుట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలని ఈ నెల 26న నిర్వహిస్తున్న నిరసన ప్రదర్శనను కార్మికులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్ని విజయవంతం చేయాలని వామపక్ష నాయకులు కోరారు. పట్టణంలోని శ్రీనివాస రోడ్డులోని ఐఎఫ్‌టీయు కార్యాలయంలో నిరసన ప్రదర్శనకు సంబదించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ అవలంబిస్తున్న విదానాలతో కర్పొరేట్ శక్తులే ప్రయోజనాలు పోందుతున్నా యని, కార్మికులకు, రైతులకు సామన్య ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కార్మిక కోడ్ వల్ల కనీస వేతనం, ఉద్యోగ భద్రత్త, సామాజిక భద్రత్త, 8 గంటల పని దినాలు, ట్రేడ్ యూనియన్ హక్కులు అగమ్య గోచరంగా మారనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికి బీజేపీ పాలిత ప్రాంతాలలో కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాలను రద్దు చేసి పన్నెండు గంటల పని దినాల్ని అమలులోకి తెచ్చారన్నారు. అన్ని పంటలకు మద్దతు ధర వ్యవసాయ ఖర్చుకు యాభై శాతం అదనంగా జోడించి అమలు చేయ్యాలని డి మాండ్ చేశారు. ఈ నెల 26న జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ చౌరస్తా వద్ద జరిగే నిరసన పదర్శనను విజ యవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నేతలు లెల్లల బాలకృష్ణ, పుప్పాల శ్రీకాంత్, సుతారి రాములు, చింత భూమేశ్వర్, తిరుపతి నాయక్, చౌదరి, చెన్న విశ్వనాథం, ఎండి మౌలానలతో పాటు పలువురు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వామపక్ష నాయకులు

పురుగుల మందు దుకాణాల తనిఖీ

కథలాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కనకదుర్గ పెస్టిసైడ్ దుకాణం, రైతు డిపోలను మండల వ్యవసాయాధికారిణి యోగిత ఆకస్మికంగా తనిఖీలు చేశారు. దుకా ణాల్లో స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించకపోవడం, ప్రిన్సిపాల్ సర్టిఫికేట్ లేకపోవడం వలన డీలర్లపై ఆగ్రహం వెలిబుచ్చారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, గ్రోమోర్ కేంద్రంను పరిశీలించి స్టాక్ రిజిస్టర్ అప్‌డేట్ చేయాలని ఆదేశించినట్టు ఏవో తెలిపారు. రైతులు లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే పురుగుల మందులు కొనగోలు చేయాలని సూచించారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

కోరుట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన కాంటినెంటల్ పోటోకన్ కరాటే డు ఇండియా ఆధ్వర్యంలో అల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్, సిని హీరో రేబెల్ కృష్ణంరాజు మెమోరియల్ కప్ 2024 జాతీయ స్థాయి పోటీలలో కోరుట్ల ఒకినావా స్కూల్ కరాటే విద్యార్థులు ప్రతిభ కనపరిచి బంగారు పతకాలు సాధించినట్లు కరాటే ఇన్‌స్టక్టర్ అలే రమేష్ సోమవారం తెలిపారు. కట, కుమ్మిటే విభాగాలలో దీక్షిత్, నిశాంత్, హర్షిణీ, శంకర్, బన్ శ్రీధర్ పథకాలు సాధించినట్లు తెలిపారు.

వైభవంగా గంగామాత కల్యాణం

మెట్‌పల్లి రూరల్, నవంబర్, 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని గంగామాత ఆలయంలోని అమ్మ వారి కల్యాణం గంగపుత్ర యూత్, గ్రామాభివృద్ధి సంఘం సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా జరిపించారు. శ్రీగంగమాత ఆలయం వార్షిక మహోత్సవంలో భాగంగా సోమవారం అమ్మ వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాల్గొని అమ్మ వారిని దర్శించుకుని పూజలు చేశారు. నాయకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి శాలువతో సన్మానించి తీర్థా ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, పుల్ల జగన్‌గౌడ్, డాకూరి వెంకటేష్, పాల్గొన్నారు.

కోటేశ్వర స్వామికి భక్తుల పూజలు

వెల్గటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా కోటిలింగాల శ్రీ కోటేశ్వర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటిలింగాల గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు నదిలో కార్తిక దీపాలు వదిలారు. అనంతరం కోటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ఐఎంఏ ఉపాధ్యక్షులు డాక్టర్ గురువారెడ్డి శిరీష దంపతులు కోటేశ్వర స్వామి దర్శకుని పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మలు శాలువాతో సత్కరించి ఆశీర్వచనాలు అందజేశారు.

●కోటిలింగాలలో గోదావరి హారతి ఘనంగా నిర్వహించారు. అర్చకులు గోదావరి ఒడ్డున ప్రత్యేక పూజల అనంతరం గోదావరికి హారతి నిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కాంతారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

జగిత్యాలలో కాంట్రాక్టు ఏఎన్ఎంల ఆందోళన

జగిత్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి వ్రాత పరీక్ష లేకుండా రెగ్యులైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టు ఏఎన్ఎంలు సోమవారం జగిత్యాలలో ఆందోళన చేశారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ప్రధాన గేటు వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంట్రాక్టు ఏఎన్ఎం అసోసియేషన్ నాయకులు మాట్లాడారు. సుమారు 20 ఏళ్లుగా ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమానం వేతనం అందజేయాలని, సర్వీస్ ప్రకారం వెయిటేజ్ కింద 50 మార్కులు కేటాయించాలని, వయోపరిమితిని ఎత్తివేయాలని కోరారు. ఆరోగ్య బీమా కల్పించాలని, ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు ఏఎన్ఎంల అసోసియేషన్ జిల్లా నాయకులు మధురిమ, వసంత, పద్మ, స్వరూప, జ్యోతి, మధులత, ఉమారాణి, సుప్రియ, ఉజ్వల, శారద, మేరీ, ఎలిజబెత్, రాజశ్రీ, సునీత, ఇంద్రాణి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు

సంక్షిప్త సమాచారం

ధర్మపురి: ధర్మపురి నియోజకవర్గంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయించాలని తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మేకల అక్షయ్ కుమార్ కోరారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు సోమవారం ఆయన వినతి పత్రాన్ని అందించారు.

రాయికల్: రాయికల్ పట్టణంలో ఓ గ్రామీణ వైద్యుడికి దేహశుద్ది చేసినట్లు ఆలస్యంగా వెలుగు చూసింది. పట్టణానికి చెందిన ఓ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో సదరు మహిళకు చెందిన వ్యక్తులు దేహశుద్ధి చేయడంతో పరారీలో ఉన్నాడని తెలిసింది. రాయికల్ ఎస్సై సుధీర్ రావును వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఆయన పేర్కొన్నారు.

మెట్‌పల్లిటౌన్: పట్టణంలోని 4వ, 5వ, 23వ వార్డులో వీధి లైట్లు సరిగ వెలగడం లేదని వెంటనే సరి చేయాలని ఆయా వార్డుల కౌన్సిలర్‌లు సభ దృష్టికి తీసుకువచ్చారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత ఆధ్యక్షతన సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వ హించారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. 13 అంశాలు సభలో ప్రవేశపెట్టాగా సభ్యులందరు ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ కమిషనర్ మోహన్, వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రావు ఉన్నారు.

వెల్గటూరు: వెల్గటూర్ మండలం చెగ్యం గ్రామ మాజీ సర్పంచ్ చెన్న పుష్పం తండ్రి వీరయ్య ఇటీవల మృతి చెందగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సోమవారం కుటుంబాన్ని పరామర్శించారు.

కోరుట్ల రూరల్: డిసెంబరు 1వ తేదీని హైదరాబాదులో నిర్వహించు మాలల సింహగర్జనకు మాలలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాయితి శంకర్ కోరారు. సోమవారం పైడిమడుగు గ్రామంలోని అంబేద్కర్ సంఘ భవనంలో మాలల సింహ గర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

భీమారం: భీమారం మండల కేంద్రం లోని ఉమ్మడి మేడిపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు ముంజ శ్రీనివాస్ తమ్ముడి కుమారుడు రిషి జ్వరంతో బాధ పడుతూ మరణించగా బీజేపీ నాయకుడు డాక్టర్ చెన్నమనేని వికాస్ సోమవారం పరామర్శించారు.

కథలాపూర్ : మండలంలోని తాండ్ర్యాలలో సోమవారం రాత్రి జమీల్ అనే వ్యక్తి ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో నిప్పంటుకుని దగ్ధమైంది. ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రాణ నష్టం సంభవించలేదు.